# వెనకమయ్య బంధాలు

ఉమాదేవి



మనుగడకి అర్థం యిదికాదు. నాగరికతకి నిర్వచనం యిది కానేకాదు.

మనిషి పూర్తిగా డబ్బుకి కట్టుబడిపోతున్నాడు.

లేచింది మొదలు బ్రతకటంకోసం చేసే ప్రయత్నంలో అయినవాళ్ల కళ్లు తడిసినా, ఆత్మీయుల హృదయం గాయపడ్డా అతడు పట్టించుకోవటంలేదు.

గమనించను కూడా గమనించటం లేదు.

మమకారమన్నది చొరనియ్యకుండా అంతరంగపు తలుపులు భళ్ళున మూసేసుకుంటున్నాడు.

జీవితాన్ని వ్యాపారం చేసుకుని స్వలాభాన్ని చూసుకుంటున్నాడు. ఎంత దారుణమైన విషయం. ఎంత నగ్న సత్యం!

పెంచిన మొక్కలమీద, ఉంటున్న ఇంటిమీద అభిమానాన్ని పెంచుకునే అతి సున్నితమైన మనిషి మనస్తత్వం ఎందుకింత కఠినమైపోతూంది? సంకుచితమైపోతూంది?

నా మనసు నంటిపెట్టుకుని టెలిఫోన్ తీగల్లా సాగుతూన్న ఈ ఆలోచనలకి మూలం సాయంత్రం జరిగిన ఓ సంఘటన...

"కేశవా! అక్కయ్య పంట్లో బావు లేదటరా... ఉత్తరం రాసింది. గుండె నీరసంగా వుంది. డాక్టరు విశ్రాంతి తీసుకోవాలన్నార్ట" అమ్మ పెద్దన్నయ్యతో చెప్పింది.

"ఆ మధ్య దాన్ని చూసినప్పుడే భయం వేసింది. బాగా బలహీనంగా వుందది" అన్నయ్య నొచ్చుకున్నట్టే అన్నాడు.

పిల్లలతో ఒక్కర్తీ చేసుకోలేక పోతూంది. పోనీ కొన్నాళ్ళు విశ్రాంతిగా వుంటుంది. ఇక్కడకి రమ్మని రాస్తే.... ఆసలది ఆ ఉద్దేశంతోనే ఉత్తరం రాసినట్టుంది.

కాస్సేపు అన్నయ్య వినబడనట్టు ఊరుకున్నాడు.

"ఏంరా, ప్రజ్ఞచేత రమ్మని రాయించమంటావా?"

అమ్మ రెట్టించగానే అన్నయ్య కస్సుమన్నాడు.

ఏవిటమ్మా! ఇప్పుడు దాన్ని రమ్మని ఎలా రాస్తాం? గతనెల్లో సెలవు పెట్టేనా జీతం సరిగా రావటంలేదు. మరోపక్క బోలెడు ఖర్చులున్నాయి. ఇప్పుడదీ పిల్లలూ వస్తే తూగ్గలమా! పోనెస్తూ! ఎవరింట్లోనే వాళ్ళకి విశ్రాంతి!" అమ్మ అభిప్రాయాన్ని కొట్టిపారేస్తూ అన్నయ్య లేచి వెళ్ళిపోయాడు.

"ఇవాల్టి పిల్లలకి అభిమానాలు తక్కువ!" ఒకటికి పదిసార్లలా అనుకుంటూ అమ్మ కన్నీళ్ళు పెట్టుకుంటుంటే నా గుండెలు ఎవరో పిండినట్టయింది.

అక్కయ్య గూర్చిన ఆలోచనలు మతిపోగొడుతుంటే హఠాత్తుగా జీతం అందిన సంగతి జ్ఞాపకం వచ్చింది. పోనీ ఒక ఏభై అక్కయ్య పేరపంపితే? అనిపించింది,

వెంటనే చెప్పు లేసుకు వెళ్ళి అక్కయ్యపేర ఏభై ఎమ్. ఒ. చేసాను. ఈ ఇంట్లో మనుష్యులకి పెద్దన్నయ్య జీతం ఆధారం. అయితే పెద్దన్నయ్యకి నా జీతం వేణ్ణీళ్లకి చన్నీళ్ళలాంటిఆధారం. జీతం అందగానే ఏభై చేతికుంచుకుని మిగతాది అన్నయ్య కిచ్చెయ్యటం అలవాటు,

భోజనాలయ్యాక, నా చేతిలోంచి రెండొందలే అందుకున్న పెద్దన్నయ్యఅడిగేడు

"మరో ఏభై ఏంవైందే? ఎక్కడైనా పారేసుకున్నావా"

క్షణం చెప్పాలా,వద్దాఅని ఆలోచించి చివరికి చెప్పేసాను.

"అక్కయ్య పేర పంపేనురా. అదెలాగో రావటంలేదుకదా, పోనీమందుకో, మరో ఖర్చుకో పనికొస్తుంది కదా అని...."

అన్నయ్య కనుబొమ్మలు ముడిపడ్డాయి,

"డబ్బు తగలెయ్యడం కాకపోతే దానిసంగతిప్పుడెందుకు? బావలేడూ చూసుకోటానికి...."

ఒళ్ళు మండింది నాకు.

"పెళ్ళయి నంతమాత్రాన అక్క అక్కకాదూ!" అన్నాను. అలా అన్నానని అన్నయ్యెంతోరాద్ధాంతం చేసాడు. నాకు పొగరెక్కువ అన్నాడు. డబ్బు ఆర్జిస్తున్నానని గర్వం అన్నాడు ఎన్నో అన్నాడు.

నేనేంవీ బాధ పడ లేదు. అనారోగ్యంతోవున్న అక్కయ్య సంగతి వదిలేసి డబ్బుగూర్చి చర్చించుకోవటమే అసహ్యమని పించింది, ఈ క్షణం కూడా నా మనసుని దొలుస్తున్నదదే! నిజానికి ఈ ఇల్లొక్కట్టే కాదేమో! సామాన్యుడి కుటుంబంలో అటూ ఇటూగా ఇలాటి సంఘటనలు జరుగుతూనే వున్నాయి. ఎవరిని కదిపినా ఆర్థిక ఇబ్బందుల గొడవే. సంభాషణ ఎక్కడ ప్రారంభమైనా అంత మౌతూన్నది డబ్బు ప్రసక్తితోనే. మనిషి సృష్టించిన డబ్బుకి మనిషిని మించిన విలువా?

వాచీ రెండు కొట్టింది.

నిద్ర సమ్మె ప్రారంభించింది కళ్లు దాన్ని ప్రసన్నం చేసుకోవాలనే ప్రయత్నంలో పడ్డాయి.

ఇద్దరూ ఎప్పుడు రాజీకొచ్చారో మరి...

* * * *

తెల వారింది. విశ్వరూపం చూపిస్తున్నట్టు వెలుగు అంతకంతకీ పెరుగుతూంది.

ఆఫీసు కెళ్ళానన్న మాటేగానీ చాలా అలసటగా వుంది.

శారీరకమైన అలసటకాదది. మానసిక మైన అలసట. మధ్యాహ్నం విరామం వేళ హరీష్ పలకరించేడు.

"హల్లో ప్రజ్ఞా ఏం విటలా వున్నావు రాత్రంతా నిద్రలేని దానిలా."

"ఇతనెంత చురుగ్గా గ్రహిస్తాడు!" ఆశ్చర్య పడ్డాను.

"ఎలా పోల్చేసాను అనుకుంటున్నావా ?-ఆ విషయం నీ ముఖమే చెబుతూంది గానీ పద, అలా కాఫీ త్రాగి వద్దాం."

ఎదురుగా వున్న హొటల్‌లోకి దారితీసాం.

హరీష్ ఏదో చెబుతున్నాడు. నేను అనాశక్తంగా వింటున్నాను. కాఫీ తాగుతుంటే నేరుగా నా వంకే చూస్తూ అన్నాడు.

"నిన్న మేనేజర్ నిన్ను తెగ పొగిడాడు" క్షణం ఆగి మళ్ళీ అన్నాడు.

"ఏమన్నాడని అడగవేం ? మళ్ళీ అంత గర్వం పనికిరాదు.

"వింటున్నానుగా చెప్పు" బుద్ధిగా అన్నాను.

"నువ్వు చాలా తెలివైన దానివట. పనంటే ఎంతో శ్రద్ధట. ఏదైనా చెప్పగానే యిట్టే గ్రహిస్తావుట. మేమంతా మాత్రం పని ఎలా తప్పించుకోవాలా అని చూస్తాంట. ఒళ్ళుమండింది నిజంగా"

పాపం! ఎందుకూ ? మేనేజర్ వున్న మాటే అన్నాడూ!"

"ఏమిటీ ? ఇది చాలా చాలా అన్యాయం."

"ఏదీ మేనేజరు నన్ను పొగడ్డమా? నేను మేనేజర్ని వెనకేసుకు రావటమా ?"

"రెండూ ను" కోపం నటిస్తూ అన్నాడు.

ఫక్కున నవ్వేను ఆ అభినయానికి. హరీష్ కూడా నవ్వేశాడు. ఇందాకటి నుంచి అతని ప్రయత్నం నన్ను నవ్వించటానికే. నేనైనా సర్వం మరచి నవ్వగలిగేది అతని సమక్షంలోనే.

ఇవాల్టి దాకా హరీష్, నేనూ స్నేహితులం. రేపోమాపో జీవితాలను కలుపుకోవాలనుకుంటున్నవాళ్ళం.

కాఫీయే పనిచేసిందో, హరీష్ మాటల్తే పనిజేసాయోగానీ అలసటంతా ఎగిరిపోయినట్టనిపించింది. సాయంత్రం పని చురుగ్గా ముగించి ఇంటిముఖం పట్టేను.

ఇంటికి వెళ్ళేసరికి తమ్ముడు నా కోసమే ఎదురుజూస్తున్న వాడిలా గబగబా వచ్చి అడిగేడు-

"జీతంకట్టాలక్కా. నాకోపధ్నాలుగు రూపాయలు కావాలి,

పొద్దుట అడుగుదామని మర్చిపోయాను. ఇంకో అరగంటలో ఆఫీసు మూసేస్తారు తొందరగా యియ్యి"

"అన్నయ్యని అడగలేదూ !"

"అడిగాను. అ స్తమానూ జీతం ఏఁవిటరా అని విసుక్కున్నాడు. జీతం నెలకొకసారే అడుగుతాను కానీ అ స్త మానూ ఎందుకడుగుతాను" అక్కా.... అమాయ కంగా అన్నాడు

జాలేసింది నాకు. పిల్లలతో ఎలా మాట్లాడటమో పెద్దన్నయ్యకి తెలీదు.

పర్సుతీసి పదిహేనిచ్చాను. పధ్నా లుగే తీసుకుని ఇంకోటి ఇచ్చెయ్య బోయాడు.

ఫరవాలేదురా ఉంచుకో అన్నాను. సంబరంగా వెళ్ళిపోయేడు.

వాడు తొమ్మిదో క్లాసు చదువు తున్నాడు.

అక్కయ్యకి డబ్బు పంపానని అన్నయ్య కోపం యింకా తీరినట్టులేదు. అందుకు తమ్ముడిమీదా చికాకు పడ్డాడు అక్కయ్యమాత్రం డబ్బు అందినట్టు ఆనందంగా ఉత్తరం రాసింది. డబ్బైతే పంపానుగానీ దాని ఆరోగ్యం ఎలా వుందో?

ఒక్కసారి అమ్మని తీసుకువెళ్ళి చూసిరావాలనే వుంది. కానీ ఏ రైలూ వూరికే పట్టుకెళ్ళదని తెలుసు.

* * *

బజారు కోలాహలంగా వుంది.

కాలమూ, డబ్బూ ఖర్చుకాని మను ష్యులు షాపింగ్ అని ముద్దుపేరు పెట్టు కుని ఎడతెరిపి లేకుండా కొంటున్నారు. ఆ రెండూ మిగలని సామాన్యులు అత్యవసరాలనే తగ్గించేసుకుంటున్నారు.

మండే ధరల మధ్య నిస్సహాయంగా మూలుగుతుంటే యాంత్రికంగా కావల సినవి కొని బయటపడ్డాను.

ఇంటికొచ్చేసరికి ఇల్లు నేను వెళ్ళి నప్పటిలా లేదు.

ఏఁవైందో ఏఁవోగానీ అంతా ముభా వంగా ఏదోపని చేస్తున్నట్టు నటి స్తున్నారు.

చిన్నన్నయ్య ఒక్కడూ కిటికీగూట్లో మోకాళ్ళమధ్య తల వొంచుకుని అడ్డంగా కూర్చున్నాడు.

మౌనంగా లోపలికెళ్లేను. విషయం అమ్మ చెప్పింది.

నాలుగురోజులై పెద్దన్నయ్య సైకిలేదో బాగు చేయించమని చిన్నన్న య్యకి చెబుతున్నాట్ట. వాడు వినిపించు కోలేదు. ఇందాక తొందరగా ఎక్క డికో వెళ్ళవలసి వచ్చేసరికి సైకిలింకా అలాగే వుంఢగానే కోపంతో చిన్న న్నయ్యని కేకలేశాట్ట.

ఉద్యోగం, సద్యోగం లేదుకదా ! ఊరు మీద తిరక్కపోతే ఇంటిపనైనా చూడకూడదూ ! అన్నాట్ట. రోషంతో చిన్నన్నయ్యా ఏదో సమాధానం చెప్పాట్ట. మొత్తం మీద యిద్దరూ వాదించుకుని మనసులు పాడు చేసు కున్నారు.

చిన్నన్నయ్య కోపం నే నెప్పుడూ

ఎరగను. వాణ్ని చూస్తే బాధ వేసింది. నిజానికి యింట్లో ఏ మాత్ర మైనా చైతన్య మన్నదుంటే అది వాడివ ల్లే.

వాడి బి. కామ్. పూర్తయ్యి రెండే ళ్లైంది. అప్పటి నుంచీ ఉద్యోగ ప్రయత్నం చేస్తూనే వున్నాడు.

ప్రతిసారిఇంటర్వ్యూలో మొదటివాడిగా నెగ్గటం ఆర్డర్సు రావలసిన సమయానికి వాడి నంబరు తొమ్మిదో నంబరుగానో పదో నంబరుగానో చిత్రంగా మారిపోవడం ... ఉద్యోగం వెళ్ళి యింకెవరి తలుపో తట్టడం.

మళ్ళీ ప్రయత్నం చెయ్యడం, మరో సారి భంగపడ్డం.ఇదీ కథ. చిన్నన్నయ్య యింకా అలాగే కూర్చున్నాడు. దగ్గిరగా వెళ్ళేను. "చిన్నన్నయ్యా! కాఫీ తాగుతావా?" విషయం ఎరగని దానిలా మామూలుగా అడిగేను.

"ఇప్పుడేం కాఫీయే! వద్దు" తలెత్తకుండానే అన్నాడు.

"స్ట్రాంగ్‌గా కలిపానురా. బావుంది. తాగకూడదూ!"

ఏమనుకున్నాడో ఏమో తీసుకు రమ్మని తాగేడు. ఖాళీగ్లాసు యిచ్చేస్తూ చేతిలోవున్న పుస్తకం చూసేడు.

"ఏం పుస్తకమే అది?"

"గాల్స్‌వర్దీ ది-జస్టిస్"

"కొన్నావా! ఎక్కడనుంచైనా తీసుకొచ్చావా?"

"కొని. తీసుకొచ్చాను."

"పుస్తకాలంటే ఏం పిచ్చే నీకు. డబ్బుంటే ఏది కొందామా అనే!"

"ఇంట్లో ఇవ్వాల్సిన అవసరమే లేకపోతే జీతం అందగానే పుస్తకాల కొట్లోనే కూచునేదాన్ని" నవ్వుతాలుగా అన్నాను.

"రక్షించావైతే! ఇదే బావుంది.ఇంటి కొస్తున్నావు." చిన్నన్నయ్య నవ్వేడు.

తరవాత చాలాసేపు ఏవో కబుర్లాడుతూ కూర్చున్నాం. ఈ లోపల పెద్దన్నయ్యా శాంతించాడేమో "ఏమిటర్రా కబుర్లు"అంటూ తనూ వొచ్చి కలిసేడు.

అప్పటికి గాలి తెలికైంది. నిశ్శబ్దం పలచబడింది.

* * *

కోర్కెలన్నవి ఊహలో అంతస్థులు పెంచుకుంటూ పోయే భవనాలు. వాస్తవంలో ఒక్కుదుటున కూలిపోయే పేకమేడలు. అయితే ఆ విషయం అనుభవంలోగానీ మనిషికి తెలిసిరాదేమో భావిజీవితాన్ని ఎంతో సుందరంగా ఊహించుకున్నాను.

హరీష్ ఉత్తము డనుకున్నాను. విశాలభావాలున్న వాడనుకున్నాను, కానీ అతడూ సగటు మనిషిలాగే ప్రవర్తించేడు.

విన్న హరీష్ యింటికి వెళ్లేను.

'రా ప్రజ్ఞా!' అంటూ సాదరంగా ఆహ్వానించేసరికి పరవశించిపోయేను.

"ఏదో చెప్పాలన్నావుగా విన్నంకో

చంగా చెప్పు" అంటే మనసులో శంకలన్నీ వదిలించేసుకున్నాను.

తీరా నే చెప్పింది విన్నాక వెనకడుగు వేసాడు. నేనాశించని ఆశాభంగం పొందేను. నేనైనా చెప్పిం దేవిటి? వివాహమయ్యాక కూడా కొన్నాళ్ళపాటు మాయింటిని ఆర్థికంగా ఆదుకోవాలి అన్నాను. దానికి అతని కేమీ అభ్యంతరం వుండదనే ధీమాతో. తనకీ ఇంతకన్న తీవ్రమైన పరిస్థితులే వున్నాయి అన్నాడు. చెల్లెలికి పెళ్ళి చెయ్యాలి అన్నాడు. ఇంటిమీద అప్పు తీర్చాలి అన్నాడు. కట్నం అడగటంలేదు, నీ జీతం అయినా ఆసరా లేకపోతేఎలా? అపార్థం చేసుకోకు అన్నాడు.

అదేదీ వినేశక్తి లేకపోయింది.

అన్నీ సమర్థింపు కారణాల్లా అనిపించాయి.

క్రోధంతో, దుఃఖంతో పారిపోయొచ్చాను. మన మధ్య మరేసంబంధం వుండకూడదు అని చెప్పి మరీ వచ్చేశాను.

ఔను!

హరీష్‌కి కావలసింది నా ఉద్యోగం తప్ప నేను కాదు అన్న భావం ఊహామాత్రంగానే భరించలేనే. ఇక జీవితమంతా ఎలా రాజీ పడటం!

ఇప్పుడాలోచిస్తే యిదీ మంచికే వచ్చిందనిపిస్తూంది. తెలిసి తెలిసి మరో ఆర్థిక వలలోకెళ్ళి చిక్కుకోవటంకంటే వున్న వలనే జాగ్రత్తగా విప్పుకోవటం నయం కదూ! క్రమం తప్పకుండా ఆఫీసుకెళ్ళి వస్తున్నాను. ఇప్పుడు నాకు జేమ్స్, పాణి వాళ్ళంతా ఎలాగో హరీష్‌కూడా అలాగే-కొలీగ్. అతనూ మారేడు. పూర్వం ప్రజ్ఞా! అని చనువుగా పిలిచేవాడు. ఇప్పుడు మిస్ ప్రజ్ఞా అని గంభీరంగా పిలుస్తాడు. అవసరమైతేనే మాట్లాడతాడు. అంతే తేడా. అది, నన్ను సంతోషపరిచిందీ లేదు. దుఃఖ పెట్టిందీలేదు.

* * *

మనిషన్నాక మార్పన్నది సహజమే కానీ చిన్నన్నయ్య యింత హఠాత్తుగా మారిపోతాడని, ఇలాంటి నిర్ణయం తీసుకుంటాడని ఎప్పుడూ అనుకోలేదు.

సినిమాల్లో కనిపించే అందమైన భవనాలు, పొడవాటికార్లు వున్న ఒక పెద్ద ఆఫీసరుగారి అమ్మాయిని చేసుకుని వాళ్ళింటల్లుడిగా స్థిరపడిపోయేడు. ఆయన పెద్దఉద్యోగం యిప్పిస్తానన్నందుకు కావచ్చు, ఆస్తి రాసిస్తానన్నందుకు అవచ్చు - కారణం ఏదైనా ఎవరికీ యిష్టంలేని పనది.

"కష్టపడి చదివిస్తే నాకు ఆసరా అయ్యాడు కాదు. ఉత్త కృతఘ్నుడు" అని పెద్దన్నయ్య కోపం వచ్చినప్పుడల్లా విసుక్కుంటున్నాడు. వదినా విసుక్కుంటూంది. ఆవిడ తప్పు లేదు. చిన్నన్నయ్య చదువుకోవం

ఆవిడ నగ ఒకటి బ్యాంకులో పెట్టి పెద్దన్నయ్య అప్పు తెచ్చాడు - చిన్నన్నయ్య ఉద్యోగం అయిన క్షణం తీర్చెయ్య వచ్చని. ఇప్పుడంతా అడ్డదిడ్డమైంది.

అంతూ, దరీ తోచని సమస్యలు.

మరో ఋతువు మారింది. రోజులు ఏ విలువా లేకుండా వెళ్ళిపోతున్నాయి. ఆఫీసుకు సెలవేమో మధ్యాహ్నం ఏంవీ తోచక పాత ఆల్బమ్ తిరగవేస్తూ కూర్చున్నాను.

అందులో.

అక్కయ్యా, పెద్దన్నయ్యా సైకిలు మీద కూర్చుని, బేటు, బంతి పట్టుకుని రకరకాల ఫోజుల్లో తీయించుకున్న ఫోటోలు, మరికొన్ని నేనూ, చిన్నన్నయ్యా చెట్టపట్టా లేసుకుని, పిట్టగోడ మీద కూర్చుని తీయించుకున్నవి. అన్నీ చిన్నప్పటివి.

ఎన్నో ఫోటోలు. ఎన్నో రూపాలు. అన్నిటిల్లో ఒకరి మీద ఒకరికి స్వార్థం లేని ప్రేమ. నిష్కళంకమైన అభిమానం.

వాటికేసి అలా చూస్తుంటే కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగేయి. మనసుని కమ్మిన పొరలేవో విడిపోతున్నట్లనిపించింది. చిన్నప్పుడు నాతో, అక్కయ్యతో కలసి మెలసి ఆడిన అన్నలు కాల్లో ముల్లుగుచ్చుకున్నా, కంట్లో నలక పడినా అమ్మకంటే ఎక్కువగా బాధపడ్డ వాళ్ళు యివాళ మారారా? మారారు. కానీ దోషం వాళ్ళది కాదు. వాళ్ళని మార్చిన వ్యవస్థది.

కష్టానికి తగ్గ డబ్బు దొరకని బడిపంతులు ఉద్యోగంతో పెద్దన్నయ్య చికాకుపడిపోతూ అంతకంతకీ బిగుసుకుపోయి ఆర్థికముడివిప్పలేక డబ్బుమనిషిలా తయారయ్యాడు. దేవుడవాలంటే ఎలా అవుతాడు? కష్టపడతానన్నా ఉద్యోగం దొరకని చిన్నన్నయ్య విమోచనం అన్నది కనిపించక తనస్వార్థం తను చూసుకున్నాడు.

మహామనీషవాలంటే ఎలా అవుతాడు?

హరీష్! ప్రేమకి నిర్వచనం చెప్పిన హరీష్ మాత్రం డబ్బుకే ఎందుకు మొగ్గేడు?— అతను చెల్లెల పెళ్ళికి కట్నం పొయ్యాల్సి వచ్చింది. తమ్ముడి చదువుకి డొనేషన్ కట్టాల్సి వచ్చింది.

అమ్మలా ఆదరించాల్సిన వ్యవస్థే శత్రువులా పగతీర్చుకుంటుంటే మనుష్యులు తెలియకుండానే మారిపోతున్నారు. ఆర్థికావసరం ముందు సోదర బంధంకాదు, మాతృబంధంకాదు. అన్నీ వెనక్కి పడిపోతున్నాయి. కాకపోతే మనిషి జన్మతః మంచి వాడే. ఈ పరిస్థితులింకా యిలాగే సాగితే యివాళ మమకారాన్ని చంపేసుకు బ్రతుకుతూన్న మనిషి రేపు క్రౌర్యాన్ని, ద్వేషాన్ని కౌగలించుకోడూ?

అప్పుడిక జరిగేదేముంది? పతన

మన్నది ప్రారంభమవకుండానే వుండాలి గాని అయ్యాక చెయ్యిజారిన బంతిలా అదెక్కడికి పోతుందో ఎవరు చెప్పగలరు? ప్రతీసీ భూతద్దంలోంచి చూసి భయపడతాననంటుంది వదిన. నిజానికి జరుగుతూన్న సంఘటనలు మైక్రోస్కోప్‌లో చూడాల్సినంత చిన్నవా!....

* * *

చేతికందిన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ చూసుకుని నేనేమీ ఆశ్చర్య పడలేను. రెండేళ్ళుగా తప్పించుకొస్తున్నాను. ఇప్పుడిక లాభంలేదు, వెళ్ళితీరాలి.

అందరికీ దూరంగా ఎక్కడో పక్క రాష్ట్రం కొసకి వెళ్ళిపోవాలంటే బెంగగానేవుంది. నాకేకాదు ఇంట్లో అందరికీ అలానేవుంది –

కేవలం దూరంగా వెళ్ళిపోతాననే కాదు. ఇక మీదట జీతం రెండు ముక్కలై సరిపోదనికూడా.

ఒక్కోసారి ప్రకృతికూడా మనిషికి అనుకూలించదేమో!

ప్రయాణంనాడు నా మనసుకి తగ్గట్టు బయట హోరుమని వాన, ఈదర గాలి.

స్టేషనుకి పెదన్నయ్య, తమ్ముడు వచ్చేరు. ప్లాట్‌పారమ్ అంతా బురద, మట్టితో అసహ్యంగావుంది.

నన్నెక్కించి పెదన్నయ్య ఎవరితోనో మాటల్లో పడ్డాడు. తమ్ముడు మాత్రం కిటికీ దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

చిన్నక్కా నువ్వు లేకపోతే మాకేం తోచదే సెలవ దొరగ్గానే వచ్చెయ్య".

తమ్ముడి మాటలకి కళ్ళలో తిరగబోతున్న నీటిని నిగ్రహించుకున్నాను.

"తప్పకుండా వచ్చేస్తారా.. ఒకవేళనే రాకపోతే నువ్వే వచ్చేద్దువుగాని."

"ఓ! వచ్చేస్తాను" విలాసంగా జుట్టు వెనక్కి తోసుకుంటూ అన్నాడు.

మరికాస్సేపట్లో రైలు కదిలింది.

ఉత్తరంరాయి అన్నాడు పెద్దన్నయ్య. తమ్ముడు చేతిరుమాలు ఊపేడు.

క్రమంగా యిద్దరూ కనుమరుగయ్యారు.

పెట్టిలోపల చుట్టూ ఒకసారి చూసి సర్దుకు కూర్చున్నాను. ఇందాక తమ్ముడి మాటలే చెవిలో వినిపిస్తున్నాయి. ఎంత తియ్యనిమాట! ఎంత ప్రేమగా అన్నాడు!

వీడూ రేపు పెరిగి పెదయ్యాక, జీవితం ఏమిటో అర్థమయ్యాక యిలాగే వుండగలడా? అభిమానం చూపగలడా? ఆ ఆలోచన క్షణం బాధ కలిగించినా మళ్ళీ సర్దుకున్నాను.

ఇవాళ నిన్నలా వుందా?

రేపు మాత్రం యివాళలా ఎందుకుంటుంది?

ఈ పరిస్థితులన్నీ బాగుపడతాయి. రోజులు తప్పకుండా మారతాయి. మనిషి తెలుసుకోవాలేగానీ మార్పెంత పేష?